www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 11 జూలై 2023

5

పశ్చిమ గోదావరి

దుంపగడపలో 14న జాబ్‌మేళా

ప్రజాశక్తి - ఆకివీడు

ఈ నెల 14వ తేదీ శుక్రవారం తమ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు దుంపగడప వివి.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.సుజాత, ప్రణాళికాభివృద్ధి కమిటీ కార్యదర్శి పిబి.ప్రతాప్‌కుమార్ తెలిపారు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కళాశాలలో మూడేళ్ల నుంచి జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 14న జరగనున్న జాబ్‌మేళాలో ఉద్యోగులను ఎంపిక చేసేందుకు ప్రముఖ 13 సంస్థలు పాల్గొనున్నట్లు తెలిపారు. అపోలో ఫార్మసీ, యాక్సిస్ బ్యాంకు, ముత్తూట్ ఫైనాన్స్, రిలయన్స్ లైఫ్ ఇన్సూరెన్స్, ఎయిర్టెల్ పేమెంట్ బ్యాంక్ తదితర సంస్థలు వస్తాయని తెలిపారు. పది, ఇంటర్, ఐటిఐ, డిప్లమో, డిగ్రీ, బిటెక్ విద్యార్థులు హాజరు కావచ్చని తెలిపారు. సమావేశంలో ఇంజినీర్ లయన్స్ రీజన్ సెక్రటరీ దాసరి సత్యనారాయణ, లయన్స్ క్లబ్ అధ్యక్షులు వివి.కృష్ణంరాజు పాల్గొన్నారు.

కదంతొక్కిన అంగన్‌వాడీలు

నల్ల చీరలు ధరించి నినదిస్తున్న అంగన్వాడీలు

ఒకపక్క హోరు గాలి.. మరోపక్క జోరు వాన.. ఇవేమీ లెక్క చేయకుండా సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా అంగన్వాడీలు కదంతొక్కారు. జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా తరలొచ్చిన అంగన్వాడీలతో కలెక్టరేట్‌కు వెళ్లే ప్రాంతం జనసంద్రమైంది.

సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ వద్ద 36 గంటల ధర్నా ప్రారంభం

నలుపు చీరలు ధరించి వినూత్న నిరసన

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై విధానాలపై నిరసన హోరు

ధర్నాకు మద్దతు తెలిపిన సిపిఎం, ప్రజాసంఘాలు

అక్కడే అంగన్వాడీల రాత్రి బస

భవిష్యత్తులో సమ్మెకు సిద్ధం కావాలి

అంగన్వాడీల జిల్లా అధ్యక్షులు ఝాన్సీలక్ష్మి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం తగదు

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాయ్

అంగన్వాడీలకు అండగా సిపిఎం

ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బలరాం

వంటా వార్పు చేస్తున్న అంగన్వాడీలు

మాట్లాడుతున్న రాజా రామ్మోహన్ రాయ్

ప్రజాశక్తి - భీమవరం/భీమవరం రూరల్

అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) పిలుపులో భాగంగా అంగన్వాడీలు సోమవారం చేపట్టిన 36 గంటల నిరవధిక ధర్నా మొదటి రోజు విజయవంతమైంది. విస్సాకోడేరు పెద్దవంతెన సమీపాన కలెక్టరేట్‌కు వెళ్లే మార్గంలో చేపట్టిన ధర్నాకు అంగన్వాడీ హెల్పర్లు, వర్కర్లు, మినీ వర్కర్లు సుమారు మూడు వేల మంది తరలొచ్చారు. వాతావరణం అనుకూలంగా లేనప్పటికీ జోరు వాన కురుస్తున్నా అవేమీ లెక్కచేయకుండా అంగన్వాడీలంతా నలుపు చీరలు ధరించి వినూత్నరీతిలో నిరసన తెలిపారు. కనీస వేతనం రూ.26 వేలు ఆదించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.ఐదు లక్షలివ్వాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారానికి జిల్లాస్థాయిలో జాయింట్ సమావేశం ఏర్పాటు చేయాలని, హెల్పర్ల ప్రమోషన్లకు వయోపరిమితి 50 సంవత్సరాలకు పెంచాలని, లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారం సరఫరా చేయాలని, మెనూ ఛార్జీలు పెంచాలని, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభకు యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.ఝాన్సీలక్ష్మి అధ్యక్షత వహించి మాట్లాడారు. సమస్యలపై తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ముఖ్యమంత్రి జగన్ అంగన్వాడీలకు ఇచ్చిన హామీ గుర్తు లేదా అని ప్రశ్నించారు. తొమ్మిదేళ్ల పాటు అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ము కాయడం తప్ప అంగన్వాడీల కోసం ఆలోచన చేయలేదన్నారు.

2017 నుంచి టిఎలు ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వాలు స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. యూనియన్ జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఉద్యోగ భద్రత, కనీస వేతనం గ్రాట్యూటీ అమలు చేయకపోవడం దారుణమన్నారు. సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమించాలన్నారు. ప్రజానాట్యమండలి నాయకులు షేక్ వలీ, చైతన్య ప్రసాద్ ఆలపించిన గీతాలు అంగన్వాడీల్లో ఉత్తేజాన్ని నింపాయి. కార్యక్రమానికి సిఐటియు జిల్లా నాయకులు తెలగంశెట్టి సత్యనారాయణ, కర్రి నాగేశ్వరరావు, పివి.ప్రతాప్, ఎస్.రంగారావు, బి.వాసుదేవరావు, ఎం.ఆంజనేయులు, వెంకటేశ్వరరావు, అంగన్వాడీల నాయకులు రాణి, ఎమ్‌డి.హసీనా, కె.తులసి, మహాలక్ష్మి, శ్యామల, స్వర్ణ, మార్తమ్మ, అమరావతి, ప్రభావతి, నాగరత్నం, రాజమణి, కుమారి, దేవి నాయకత్వం వహించారు.

పలు సంఘాల మద్దతు

అంగన్వాడీల నిరవధిక ధర్నాకు పలు ప్రజాసంఘాలు మద్దతు తెలిపాయి. ఐద్వా, రైతుసంఘం, కెవిపిఎస్, ఆశా వర్కర్స్ యూనియన్, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా నేతలు పి.పూర్ణ, జుత్తిగ నరసింహమూర్తి, కె.క్రాంతిబాబు, జ్యోతి, ఎ.అజయకుమారి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలపై పర్యవేక్షణ పేరుతో వేధింపులకు గురి చేయడం దారుణమన్నారు. అంగన్వాడీలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు.

అక్కడే అంగన్వాడీల రాత్రి బస..

36 గంటల పాటు నిరవధిక ధర్నా నేపథ్యంలో వేలాదిగా తరలొచ్చిన అంగన్వాడీలు ధర్నా ప్రాంతంలోనే సోమవారం రాత్రి బస చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ బట్టలు సంచిలో పెట్టుకుని, చిన్నారులను చంకనెత్తుకుని వచ్చిన అంగన్వాడీలు ధర్నా చోటే బస చేశారు. వాతావరణ మార్పులతో ఇబ్బందికర పరిస్థితులు ఉన్నప్పటికీ అంగన్వాడీలు వెనుకంజ వేయకపోవడం విశేషం. స్థానికంగా వంటావార్పు చేసి నిరసన తెలిపారు.

ధర్నా ప్రాంతంలోనే నిద్రిస్తున్న అంగన్వాడీలు

అంగన్వాడీలకు అండగా సిపిఎం.. ★ ★ ★

ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బలరాం

అంగన్వాడీలకు సిపిఎం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి ఆందోళనకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం చెప్పారు. అంగన్వాడీల ధర్నాకు మద్దతు ప్రకటించి బలరాం మాట్లాడారు. సమాజానికి సంబంధించి బాధ్యత గల కోర్కెలను అంగన్వాడీలు డిమాండ్లలో పొందుపర్చడం అభినందనీయమన్నారు. ఐసిడిఎస్‌ను బలోపేతం చేయాలన్నారు. అంగన్వాడీల కష్టాలు, కృషి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టడం లేదని విమర్శించారు. నూతన విద్య విధానం అత్యంత దుర్మార్గమైందన్నారు. విద్య, వైద్యం వంటి సౌకర్యాలు అంగన్వాడీలకు అందకపోవడం బాధాకరమన్నారు. చట్టాలు, హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలకు స్కీమ్‌వర్కర్లు ఐక్యంగా గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం తగదు.. ★ ★ ★

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్

మాతాశిశుసంక్షేమంలో కీలక పాత్ర పోషిస్తున్న అంగన్వాడీల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ అన్నారు. ధర్నానుద్దేశించి మాట్లాడుతూ అంగన్వాడీలను కేంద్రాలకు, తల్లీబిడ్డలకు దూరం చేస్తూ ఆన్‌లైన్ వర్కులు అప్పగించి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ప్రస్తుత వేతనం పెరిగిన ధరలతో పోలిస్తే ఒక మూలకు కూడా రాదన్నారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుంటే మరింత ఉధృతంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి.. ★ ★ ★

సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్

అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ డిమాండ్ చేశారు. ధర్నానుద్దేశించి ఆయన మాట్లాడుతూ కష్టజీవుల కుటుంబాల్లోని మహిళలకు, పిల్లలకు సేవలందిస్తున్న అంగన్వాడీలు నిరుపేదలని, రూ.10 వేలు జీతం దాటింది, కరెంటు బిల్లు ఎక్కువ వచ్చిందనే పేరుతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వారికి అందకుండా అడ్డుకోవడం అత్యంత దారుణమన్నారు. గతంలో అంగన్వాడీలపై విరుచుకుపడ్డ చంద్రబాబు ప్రభుత్వం కుప్పకూలిందని, ఈ విషయాన్ని వైసిపి గమనంలో ఉంచుకోవాలని హెచ్చరించారు.

మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్

విద్యార్థి సంగ్రామ సైకిల్‌యాత్ర ప్రారంభం

ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధే లక్ష్యం

ప్రారంభ సభలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

జిల్లాలో ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధే లక్ష్యంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర నరసాపురంలో సోమవారం ఉదయం ప్రారంభమైంది. ఈ సందర్భంగా పట్టణంలోని కళాశాల, పాఠశాలల విద్యార్థులు తరలిరాగా వైఎన్ కళాశాల రోడ్డులో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌ఐ పట్టణాధ్యక్షులు ఎమ్‌డి.జాన్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథి, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ విద్యను బలపేతం చేయాలన్నారు. జిల్లాలో ప్రభుత్వరంగంలో యూనివర్సిటీని అన్ని కోర్సులతో ప్రారంభించాలని డిమాండ్ చేశారు. జూనియర్, డిగ్రీ కాలేజీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని కోరారు. నాడు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి పీజీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇస్తే ఆయన తనయుడు జగన్ ఆ స్కాలర్‌షిప్‌లను ఎత్తేశారని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో రాష్ట్రంలో కొన్ని వేల మంది పేద విద్యార్థులకు జగన్ ప్రభుత్వం ఉన్నత విద్యను దూరం చేసిందని మండిపడ్డారు. జిల్లా కార్యదర్శి డి.పెద్దిరాజు మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులకు రోజుకి కేవలం రూ.52 కేటాయించడం హాస్టల్ విద్యార్థుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో తెలియజేస్తుందని విమర్శించారు. ఆ రూ.52తో మార్కెట్లో మంత్రి ఒక్క పూట టిఫిన్ చేయగలరా అని ప్రశ్నించారు. హాస్టల్ విద్యార్థులకు మెస్ ఛార్జీలు నెలకు రూ.2500కు పెంచాలని కోరారు. అనంతరం కె.ప్రసన్నకుమార్ జెండా ఊపి సైకిల్ యాత్రను ప్రారంభించారు. యాత్ర పట్టణంలో పలు పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లను సందర్శించింది. ఈ సందర్భంగా పలు పాఠశాలల్లో జగనన్న విద్యా కానుక కిట్లు నాసిరకంగా ఉన్నట్లు గుర్తించామని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు పి.వాసు తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం మెనూ మార్చినప్పటికీ ఛార్జీలు పెంచకపోవడం వల్ల నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు టి.ప్రసాద్, నాయకులు పి.సాగర్, అనిల్, సూరజ్, ప్రవల్లిక, సిరి, కె.యశ్వంత్, పి.నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వాలంటీర్ల వ్యవస్థ

ఏలూరు నియోజకవర్గ సమావేశంలో పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, అర్బన్

ఎవరేమనుకున్నా వాలంటీర్ వ్యవస్థ ప్రమాదకరంగా మారుతోందని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. ఏలూరు నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులతో నిర్వహించిన సమావేశంలో పవన్ మాట్లాడారు. గెలిచినప్పుడు కాదని, ప్రతికూల పరిస్థితుల్లోనూ ఎలా ఉన్నామో చూడాలన్నారు. జనసేనకు బలమైన కేడర్ ఉంటేనే వైసిపికి బైబై చెప్పగలమన్నారు. ఏలూరులో డిగ్రీ కాలేజీ విద్యార్థులు ఇంకా చెట్లకింద చదువుకోవడం బాధేస్తుందన్నారు. జనం మార్పు కోసం తహతహలాడుతున్నారన్నారు. వలంటీర్ల పొట్ట కొట్టాలన్న ఉద్దేశం తనకు లేదన్నారు. నెలకు రూ.5,200 జీతానికి యువతను గ్రామాల్లో కట్టిపడేస్తున్నారన్నారు. డిగ్రీ చదువుకుని ఆ జీతానికి పనిచేయడం చూస్తే నిరుద్యోగం ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు నాదెండ్ల మనోహర్, కొటికల పూడి గోవిందరావు, కనకరాజు సూరి, రెడ్డి అప్పలనాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫిర్యాదులకు శాశ్వత పరిష్కారం చూపాలి

జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణ వేణి

ప్రజాశక్తి - భీమవరం

స్పందనలో వచ్చిన ప్రతి ఫిర్యాదుకూ శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి స్పందన కార్యక్రమంలో పాల్గొని, వివిధ సమస్యల పరిష్కారం కోసం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీలను డిఆర్‌ఒ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పందనలో అందే వినతుల పరిష్కారం అర్జీదారులు సంతృప్తి చెందేలా ఉండాలన్నారు. అర్జీలు తిరిగి రీ ఓపెన్ అయ్యే అవకాశం లేకుండా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అధికారులకు డిఆర్‌ఒ సూచించారు. సోమవారం 187 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో కొన్ని ఈ విధంగా ఉన్నాయి. భీమవరం మండలం బేతపూడి పంచాయతీ శివారు యమునాపల్లికి చెందిన పైడి ఏసు పాదం తన పంట పొలానికి సాగునీరు రాకుండా అడ్డుకట్ట వేసి ఇబ్బందులు గురి చేస్తున్నారని, న్యాయం చేయాలని కోరాడు. తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెం గ్రామానికి చెందిన నీలపాల పుల్లమ్మ తన భర్త కరోనాతో మరణించాడని, ముగ్గురు కుమారులు ఆస్తి తీసుకున్నారు గానీ తనను చూడడం లేదని న్యాయం చేయాలని కోరింది. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా పంచాయతీ శాఖ అధికారి జివికె మల్లికార్జునరావు, డిఎల్‌డిఒ కెసిహెచ్ అప్పారావు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

డిపిహెచ్‌ఎన్‌ఒ వెంకటరత్నం

ప్రజాశక్తి - కాళ్ల

ప్రజలకు మెరుగైన సేవలందించాలని జిల్లా ప్రజారోగ్య నర్సింగ్ అధికారి జి.వెంకటరత్నం వైద్య సిబ్బందిని ఆదేశించారు. కాళ్ల పిహెచ్‌సిని జిల్లా ప్రజారోగ్య నర్సింగ్ అధికారి జి.వెంకటరత్నం సోమవారం తనిఖీ చేశారు. గర్భిణులు, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలతో మాట్లాడారు. ఎంసిడి కార్డులు తనిఖీ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు గర్భిణులకు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. స్త్రీలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. పౌష్టికాహారం గురించి, సాధారణ కాన్పు వల్ల కలిగే ప్రయోజనాలు, కుటుంబ నియంత్రణలో భాగంగా తాత్కాలిక పద్ధతులు, స్క్రీనింగ్ టెస్టుల గురించి వివరించారు. ఆశా కార్యకర్తలకు సంబంధించిన సెల్‌ఫోన్లు కొన్ని సరిగ్గా పనిచేయడం లేదని, అటువంటి సెల్‌ఫోన్లకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. అనంతరం పిహెచ్‌సిలో ఆమె పలు రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బందికి తగు సూచనలు చేశారు. దాత ఆర్థిక సహకారంతో గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం. గులాబ్ రాజ్‌కుమార్, సిహెచ్‌ఒ డి.విజయవతి, పిహెచ్‌ఎన్ డి.చండీరాణి, డిసిఎంజి.బాల, హెచ్‌విపి.పరంజ్యోతి, ఎఎన్‌ఎంలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పవన్‌కళ్యాణ్ క్షమాపణ చెప్పాలి

జిల్లాలో వాలంటీర్ల నిరసన ర్యాలీలు

ప్రజాశక్తి - వీరవాసరం

వాలంటీర్లపై జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ చేసిన అనుచిత వాఖ్యలను వెనక్కి తీసుకోవాలని వాలంటీర్లు ఆందోళన చేపట్టారు. ఈ మేరకు సోమవారం వీరవాసరం తూర్పు చెరువు సెంటర్ వద్ద కొద్దిసేపు పవన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ క్షమాపణ చెప్పాలంటూ డిమాండ్ చేశారు. కరోనా సమ యంలో వాలంటీర్లు చేసిన సేవలు పవన్‌కు గుర్తులేవా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో మండల వాలంటీర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆకివీడు : వాలంటీర్లపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలకు మహిళా వాలంటీర్లు నిరసన తెలిపారు. స్థానిక వైసిపి నాయకుల సమన్వయంతో నగర పంచాయతీ కార్యాలయం వద్ద కొద్దిసేపు నిరసన తెలిపారు. అనంతరం వారు అక్కడి నుంచి పట్టణ వీధుల గుండా ర్యాలీగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పవన్ కళ్యాణ్‌పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వాలంటీర్లు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ బేషరతుగా వాలంటీర్లకు క్షమాపణ చెప్పాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమం మరింత తీవ్రతరం అవుతుందని హెచ్చరించారు.

తాడేపల్లిగూడెంలో పవన్‌కళ్యాన్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వాలంటీర్లు

కార్యక్రమంలో వాలంటీర్లు, ఛైర్‌పర్సన్ జామి హైమావతి పాల్గొన్నారు.

ఉండి : వాలంటీర్ల వ్యవస్థపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలకు చెరుకువాడ వాలంటీర్ చేబ్రోలు నాగమణి ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కరోనా సమయంలో ప్రపంచ దేశాలు ఆంధ్ర రాష్ట్రం వైపు చూసేలా వాలంటీర్లు పనిచేశారని గుర్తు చేశారు. పవన్ కళ్యాణ్ వాలంటీర్లపై చేసిన వ్యాఖ్యలను భేషరతుగా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా వాలంటీర్లు పవన్ కళ్యాణ్ సభలను అడ్డుకుంటారని హెచ్చరించారు.

తాడేపల్లిగూడెం : పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలకు నిరసనగా జగన్నాధపురం గ్రామం పెంటపాడు మెయిన్ సెంటర్, తాడేపల్లిగూడెం పోలీస్ ఐల్యాండ్ సెంటర్ వద్ద వాలంటీర్లు మానవహారం నిర్వహించి, పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. పవన్ కళ్యాణ్ వెంటనే వాలంటీర్లకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

పాలకోడేరు : వాలంటీర్లను కించపర్చేలా మాట్లాడిన పవన్ కళ్యాణ్ క్షమాపణలు చెప్పాలని వాలంటీర్లు డిమాండ్ చేశారు. పాలకోడేరులో ఈ మేరకు సోమవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు దెందుకూరి వెంకటరాజు, గృహ సారధుల మండల కన్వీనర్ పాలా రాధాకృష్ణ, వాలంటీర్లు పాల్గొన్నారు

కల్లుగీతపై శ్వేతపత్రం విడుదల చేయాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

కల్లుగీత కార్మికులకు వైసిపి ప్రభుత్వం నాలుగేళ్లలో ఏంచేసిందో శ్వేతపత్రం ప్రకటించాలని కల్లు గీత కార్మిక సంఘం డిమాండ్ చేసింది. డివిజన్ కల్లుగీత కార్మికుల విస్తృత సమావేశం కడలి పాండు అధ్యక్షతన సోమవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ ఆనాడు పాదయాత్రలో కల్లుగీత కార్మికులను ఆలింగనం చేసుకుని ఇచ్చిన వాగ్దానాలు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వం చీప్ లిక్కర్‌ను విచ్చలవిడిగా అమ్మేస్తూ 80 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర ఉన్న కల్లుగీత వృత్తిని దారుణంగా దెబ్బతీసిందని విమర్శించారు. ప్రాణాలకు తెగించి వృత్తి చేస్తున్న గీతన్నలను ఆదుకునేందుకు ప్రభుత్వం ఏం చేసిందో ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలు ఇస్తామని ప్రకటించి తొమ్మిది నెలలు కావస్తున్నా ఇప్పటికీ స్పష్టమైన ఆదేశాలు ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. పొరుగు రాష్ట్రాలు గీత వృత్తిని అన్నివిధాలా ఆదుకుంటుంటే, మన రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం విధానాల వల్ల కార్మికులు బతకలేక నగరాలకు, పొరుగు దేశాలకు వలస పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గీత కార్పొరేషన్‌కు తక్షణం రూ.5 వేల కోట్లు కేటాయించి, గీత కార్మికుల సంక్షేమం కోసం పని చేయించాలన్నారు. గీతవృత్తి ఆధునికీకరణకు నిపుణులతో అధ్యయన కమిటీ వేయాలని, ప్రమాదాలను నివారించడానికి సేఫ్టీ మోకులు ఇవ్వాలని, నీరా, తాటి ఉత్పత్తుల పరిశ్రమలు పెట్టాలని కోరారు. కల్లుకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు ఈ సమావేశంలో జిల్లా సహాయక కార్యదర్శి బొక్కా చంటి, చింతపల్లి వీరాస్వామి, కోమటి సత్యనారాయణ, తుంగ సాయిబాబు, కాగిత రాధాకృష్ణ, దొంగ సత్యనారాయణ, వీరవల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెనుమంట్రలో వర్షం

ప్రజాశక్తి - పెనుమంట్ర

సోమవారం తెల్లవారుజాము నుంచి మండలంలో మోస్తారు వర్షం పడింది. దీంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా పొలమూరు నుంచి మాముడూరు వెళ్లే రహదారి గుండా రూ.20 లక్షలతో నిర్మించిన డ్రెయినేజీ ముంపునకు గురై రోడ్డంతా అస్తవ్యస్తంగా తయారైంది. మండలంలో మొత్తం 63.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

పెనుమంట్రలో కురుస్తున్న వర్షం

డ్రెయినేజీలో పూడిక తీత

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - మొగల్తూరు

వెంగళప్పా రంలోని మసీద్ సెంటర్ ప్రాంత సమీపంలో ఉన్న డ్రెయినేజీలోని పూడిక సోమవారం పారిశుధ్య కార్మికులు తొలగించారు. ప్రజాశక్తిలో ప్రచురితమైన మొగల్తూరులో పారిశుధ్యం అస్తవ్యస్తం కథనంపై పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి కార్యదర్శి జయరాజు స్పందించారు. ఈ మేరకు ఆయన ఆదేశాల మేరకు శానిటరీ మేస్త్రి మొగలాపు రమేష్ పర్యవేక్షణలో సిబ్బంది డ్రెయినేజీలో పేరుకుపోయిన మట్టిని తొలగించి సమస్యను పరిష్కరించారు.

డ్రయినేజీలో పూడిక తీస్తున్న సిబ్బంది

కోమర్రు ఎఎన్ఎం మృతి

ప్రజాశక్తి - గణపవరం

మండలంలో పిప్పర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కోమర్రు సచివాలయంలో ఎఎన్ఎంగా పనిచేస్తున్న శిరీష (35) సోమవారం ఉదయం అనారోగ్యంతో భీమడోలులోని ఆమె స్వగృహంలో మృతి చెందినట్లు కాశిపాడు ఆరోగ్య సహాయకులు నామాల రాజు తెలిపారు. శిరీష 2020 నుంచి కోమర్రు గ్రామంలో ఎఎన్ఎంగా ప్రజలకు వైద్య సేవలందిస్తుందని చెప్పారు. ఆమెకు భర్త కుమారుడు ఉన్నారని చెప్పారు. ఆమె మృతికి ప్రాథమిక ఆసుపత్రి డాక్టర్ కె.ప్రియాంక, వైద్య సిబ్బంది తమ సంతాపం తెలిపారు.

ఫీవర్ సర్వే పరిశీలన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా స్థానిక పట్టణ ఆరోగ్య కేంద్రం యాగర్లపల్లి పరిధిలోని 24, 20, 25 వార్డుల్లో జరుగుతున్న ఫీవర్ సర్వేను సోమవారం తాడేపల్లిగూడెం సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సర్వే బృందాలకు సహకరించి జ్వరాలపై కచ్చితమైన సమాచారం ఇవ్వడం ద్వారా ప్రాథమిక స్థాయిలో పరీక్షలు నిర్వహించి పేషెంట్ త్వరగా కోలుకోవడానికి వీలుంటుందన్నారు. ఎఎన్ఎం, శానిటేషన్ కార్యదర్శులు ప్రతి గృహం వద్ద ఎప్పటికప్పుడు సమస్యలను గుర్తించడం ద్వారా వ్యాధులకు అడ్డుకట్ట వేయవచ్చని పిలుపునిచ్చారు. ప్రాథమిక నిర్ధారణ పరీక్షలు అన్ని పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సమిష్టికృషితో డెంగీ, మలేరియా వ్యాధులను అరికడదామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శులు జయభారతి, నాగమల్లి, ఆరోగ్య సహాయకులు ప్రసాద్ బాబు, నూతక్కి, కాంతారావు పాల్గొన్నారు.

దుకాణాలు అద్దెకు ఇచ్చేందుకు నోటిఫికేషన్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం ఆర్టిసి బస్టాండ్ పరిధిలోని ఆరు (6) దుకాణాలు అద్దె ప్రాతిపదికన ఇచ్చేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఆటోమొబైల్స్, శానిటరీ వస్తువులు, గోడౌన్, గృహ ఉకరణాల ప్రదర్శన, లేజర్ కటింగ్ వర్క్ షాపు, కూల్ డ్రింక్స్, జనరల్ స్టోర్స్, కిరాణా, జనరల్ స్టోర్స్, ఎసి, రిఫ్రిజిరేటర్ స్పేర్స్, సర్వీసులకు వినియోగించుకోవచ్చని తాడేపల్లిగూడెం డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలవారు డిపో మేనేజర్ కార్యాలయంలో ఈ నెల 18వ తేదీలోపు దరఖాస్తు పొంది, పూర్తి చేసిన అనంతరం భీమవరం జిల్లా ప్రజారవాణా అధికారి (డిపిటిఒ) వారి కార్యాలయంలో ఈ నెల 19వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల లోపు టెండర్ బాక్స్‌లో వేయాలని తెలిపారు.

గీతికాదేవికి పలువురి అభినందన

ప్రజాశక్తి - తణుకు రూరల్

గత నెల జూన్ 19వ తేదీ నుంచి 25వ తేది వరకు చెన్నైలోని బిఎస్ అబ్దుల్ రెహమాన్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ వారు నిర్వహించిన నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపు(ఎన్ఎస్ఎస్)నకు ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ పరిధిలోని ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల బిఎస్‌సి (కంప్యూటర్స్) విద్యార్థిని ఈతకోట గీతికాదేవి ప్రాతినిధ్యం వహించిందని కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఈతకోట గీతికదేవిని కళాశాల వ్యవస్థాపక సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, వివేకానంద గ్లోబల్ స్కూల్ సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి రీనాసాయి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ జి.రమ్య, సిహెచ్.రమేష్‌బాబు, సిబ్బంది, విద్యార్థినులు అభినందించారు.


లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

లయన్స్ క్లబ్ పాలకొల్లు అధ్యక్షులుగా అన్నపూర్ణ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు లయన్స్ క్లబ్ కోస్తా ప్రాంతంలో సేవా కార్యక్రమాల నిర్వహణలో ముందుందని లయన్స్ ఫాస్ట్ విజయవాడ గవర్నర్ దామెర్ల శ్రీశాంతి చెప్పారు. పాలకొల్లు లయన్స్ క్లబ్ అధ్యక్షురాలిగా ఎన్ఎ.అన్నపూర్ణ, కార్యదర్శిగా మాఘం నారాయణరావు, కోశాధికారిగా దేనెల ప్రసాద్ సోమవారం లయన్స్ కమ్యూనిటీ హాలులో ప్రమాణస్వీకారం చేశారు. ప్రమాణస్వీకారం చేయించిన సందర్భంగా దామెర్ల శ్రీశాంతి మాట్లాడుతూ పాలకొల్లు లయన్స్ క్లబ్ సారథ్యంలో కంటి ఆసుపత్రి వల్ల ఎందరో అభాగ్యులకు కంటి చూపు వస్తోందని చెప్పారు. రూ 2.30 లక్షలను వివిధ సేవా కార్యక్రమాల్లో ఆమె చేతుల మీదుగా అందించారు. కుట్టు మిషన్ నేర్పడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ గవర్నర్లు డాక్టర్ బాబ్జి, డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ, ఛాంబర్ అధ్యక్షులు కారుమూరి నరసింహరావు, కెబి.ఫణీంద్రుడు, నందుల సీతారామరావు, కొమ్ముల మురళి, ఎన్‌విఎస్.పాపారావునాయుడు, ముచ్చర్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో పిఎం మాతృత్వ యోజన ఆవాజ్ కార్యక్రమంలో భాగంగా 35 మంది గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించారు. ఖర్జూరం, రస్కులు, ఆర్ఎస్ఎల్ అరుకులు, పండ్లు, బలమరుకులు గర్భిణులకు అందించారు. వసుధ ఫౌండేషన్ అధినేత మంతెన వెంకటరామరాజు ప్రతినెలా గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.ప్రభాకర్, పాలకొల్లు క్షత్రియ సంక్షేమ పరిషత్ సెక్రటరీ డాక్టర్ కెవిఎస్ఎస్.వర్మ, కె.రామరాజు ఆసుపత్రి సిబ్బంది కిట్ల పంపిణీలో పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

మానసిక ఒత్తిడితో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - పాలకోడేరు

విస్సాకోడేరు గ్రామానికి చెందిన తన భర్త రాజేష్‌కుమార్ (45) మానసిక ఒత్తిడికి గురై ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పి.జయలక్ష్మికుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌ఛార్జి ఎస్ఐ బి.మోహనరావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విస్సాకోడేరు గ్రామానికి చెందిన రాజేష్‌కుమార్ భీమవరం పట్టణానికి చెందిన కలిదిండి శ్రీనివాసరాజు, ఉమ్మడిసింగ్ ఏసుబాబులకు రూ.11.50 లక్షలు పలువురి వద్ద, బ్యాంకుల్లోను, తన సొంత పూచికత్తుపై అప్పులు ఇప్పించినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. అప్పులు తీసుకున్న ఇరువురూ వాటిని తిరిగి చెల్లించకపోవడంతో రాజేష్ కుమార్‌పై ఒత్తిడి వచ్చింది. దీంతో శ్రీనివాసరాజు, ఏసుబాబులను తీసుకున్న అప్పులు తీర్చాలని లేకపోతే తనకు ఆత్మహత్యే శరణ్యమని ప్రాధేయపడినట్లు తెలిపారు. వారు సరిగా స్పందించకపోగా నువ్వు చనిపోతే మాకేంటని నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో మానసికంగా ఒత్తిడికి గురై ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాలకోడేరు పోలీసులు వెల్లడించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

కోపరేటివ్ సొసైటీలను బలోపేతం చేయాలి

కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని కోపరేటివ్ సొసైటీలను బలోపేతం చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కోపరేటివ్ డెవలప్‌మెంట్ కమిటీ (డిసిడిసి) సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని సొసైటీల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేలా చూడాలన్నారు. చేతి వృత్తులకు సంబంధించి వెనుకబడిన సొసైటీలకు నాబార్డు, డిసిసిల ద్వారా రుణాలను మంజూరుచేసి వాటిని రెన్యూవల్ చేయాలన్నారు. జిల్లాలో కోపరేటివ్ సొసైటీలన్నింటినీ కంప్యూటరైజ్ చేయాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని సొసైటీలను అభివృద్ధి చేయాలని, సొసైటీల ద్వారా రైతులకు మరిన్ని సేవలు అందించాలని ఆదేశించారు.

గోడౌన్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

జిల్లాలో మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్స్ నిర్మాణం వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఇంప్లిమెంటేషన్ కమిటీ (డిఎల్ఐసి) సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ఎంపిఎఫ్‌సి (మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్స్) 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోడౌన్లకు సంబంధించి జిల్లాలో 21 గ్రామాల్లో ఎంపిఎఫ్‌సి గోడౌన్లు నిర్మాణంలో ఉన్నాయన్నారు. సమావేశం అనంతరం ఐదు గోడౌన్లకు సంబంధించిన బిల్స్ మొత్తం రూ.48 లక్షల మంజూరుకు ఆమోదించినట్లు తెలిపారు. గోడౌన్లు త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. ఫిష్ ఆంధ్ర అవుట్ లైట్స్ గ్రౌండింగ్‌పై సమీక్షించారు. డిసిసిబి ద్వారా త్వరితగతిన రుణాలు మంజూరు చేసి ఇప్పటికే గుర్తించి 166 యూనిట్లను గ్రౌండింగ్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, డిఆర్ఒ కె.కృష్ణవేణి, డిసిఒ ఎం.రవికుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, పీడీ డిఆర్‌డిఎ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మురళీకృష్ణ, సెంట్రల్ బ్యాంక్ సిఇఒ, సొసైటీ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఆధార్ సమస్యలు పరిష్కరించాలి

జగనన్న సురక్ష క్యాంపులో అధిక మొత్తంలో ఆధార్ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి జగనన్న సురక్ష, హౌసింగ్, మౌలిక వసతులు, నాడు-నేడు కార్యక్రమాలపై నరసాపురం సబ్ కలెక్టర్, భీమవరం ఆర్‌డిఒ, ఎంపిడిఒలు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఆయా శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. మండల ప్రత్యేక అధికారులు ఈ కార్యక్రమంపై దృష్టి పెట్టాలని, క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. సర్వీసు రిక్వెస్టులకు, టోకన్ల రైజ్‌కు వ్యత్యాసం ఉందన్నారు. వివాహ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని వివాహ రిజిస్ట్రేషన్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పక్కాగా తనిఖీ చేసి రేషన్ కార్డుల జారీకి చర్యలు తీసుకోవాలన్నారు. తాడేపల్లిగూడెంలో ఒకే రోజున 140 గృహాల నిర్మాణాలకు శంకుస్థాపన కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మిగతా మండలాల్లో కూడా పెద్దఎత్తున గృహ నిర్మాణాల శంకుస్థాపనకు లబ్ధిదారులను ప్రోత్సహించాలన్నారు. సచివాలయాల బిల్డింగులు 95 శాతం పైబడి పూర్తయిన వాటిని స్థానిక ఎంఎల్‌ఎతో ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, డిఐడిఒ కెసి అప్పారావు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

భీమవరంలో అన్నపూర్ణ ఫొటో స్టూడియో చిత్రబృందం సందడి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరంలో అన్నపూర్ణ ఫొటో స్టూడియో చిత్రబృందం సోమవారం సందడి చేసింది. తాను భీమవరం అమ్మాయినని, ఇక్కడే చదువుకున్నానని అన్నపూర్ణ ఫొటో స్టూడియో చిత్రం హీరోయిన్ లావణ్య తెలిపారు. బిగ్ బెన్ సినిమా సంస్థ నిర్మించిన అన్నపూర్ణ ఫొటో స్టూడియో చిత్ర బృందం సోమవారం భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలను సందర్శించింది. విద్యార్థులతో ఆడుతూపాడుతూ రెండు గంటల పాటు ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా హీరోయిన్ లావణ్య మాట్లాడుతూ తాను భీమవరంలో ఇంజినీరింగ్ చదివానని చెప్పారు. ఇక్కడ తన సినిమా ప్రమోషన్ చేయాలని నిర్మాతలను కోరగా అంగీకరించినందుకు కృతజ్ఞతలు చెప్పారు. అనంతరం చిత్ర దర్శకుడు చందు ముద్దు, హీరో చైతన్య మాట్లాడుతూ చిత్రం ఈ నెల 21న ప్రపంచవ్యాప్తంగా అన్ని థియేటర్లలో విడుదల కానుందని చెప్పారు. అనంతరం చిత్ర నిర్మాణ ఎస్.రంగినేని మాట్లాడుతూ అశ్లీల పదాలకు తావులేకుండా కుటుంబ సమేతంగా చూసే చిత్రంగా దీన్ని రూపొందించినట్లు వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ చిత్ర యూనిట్‌కి అభినందనలు తెలిపారు.

చర్మకారులకు గొడుగులు, బల్లలు ఇవ్వాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

చెప్పులు కుట్టుకునేవారందరికీ గొడుగులు, బల్లలు ఇవ్వాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బత్తుల విజయ్‌కుమార్, కె.క్రాంతిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కృష్ణవేణికి కెవిపిఎస్ జిల్లా బృందం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బత్తుల విజయ్‌కుమార్, కె.క్రాంతిబాబు మాట్లాడుతూ భీమవరం కేంద్రంలో సుమారు 60 మంది చెప్పులు కుట్టే కార్మికులు ఉన్నారని తెలిపారు. తరతరాలుగా వృత్తి చేసుకుంటూనే జీవనం సాగిస్తున్నారన్నారు. ఎండలో ఎండుతూ, వర్షానికి తడుస్తూ రోడ్డు పక్కన ప్రమాదకరమైన పరిస్థితుల్లో వృత్తి చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. గతంలో రెండు సార్లు జాయింట్ కలెక్టర్ మెప్మా అధికారులను ఆదేశించినా స్పందించలేదన్నారు. వర్షాకాలంలో వృత్తి చేసుకోవడానికి అవకాశం ఉండదని, దీంతో వారి కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు. పట్టణంలో ఉన్న చర్మకార వృత్తిదారులకు గొడుగులు, కూర్చోవడానికి బల్లలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారులు వృత్తిదారులతో సమావేశం నిర్వహించి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడతామని హెచ్చరించారు.

డిజిటల్ మార్కెటింగ్‌పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక ఛాంబర్స్ డిగ్రీ కళాశాలలో డిజిటల్ మార్కెటింగ్‌పై విద్యార్థులకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్ట్, పిన్సోఫియా ప్రై.లి. ఫౌండర్ సంతోష్ నూలి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ఆధునిక యుగంలో ప్రతిదీ డిజిటలైజేషన్ అయిందని చెప్పారు. డిజిటల్ మార్కెటింగ్‌కు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరిగిందన్నారు. నేడు ప్రతి వస్తు సేవల గురించి వినియోగదారుని చేరవేసే అత్యాధునిక సాంకేతిక పద్ధతి డిజిటల్ మార్కెటింగ్ అని, ఈ రంగంలో 18 నుంచి 60 ఏళ్ల వారికి అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని అవకాశాలను కూడా ఈ రంగం కల్పిస్తుందన్నారు. ఈ రంగంలో ప్రస్తుతం నిపుణుల కొరత ఉందని, యువత డిజిటల్ మార్కెటింగ్ స్కిల్స్ శిక్షణను పొందితే ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుత కాలానుగుణంగా వచ్చే ఆధునిక, సాంకేతిక కోర్సులపై విద్యార్థులకు అవగాహన కల్పించి వారు ఉద్యోగ అవకాశాలు పొందేందుకు కళాశాల యాజమాన్యం ముందు ఉంటుందని చెప్పారు.

సాగు నీరందించాలని వినతి

నరసాపురం టౌన్ : రైతులకు సాగు నీరు అందించడంలో ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు విఫలమయ్యారని, సాగునీరందిచేలా వెంటనే చర్యలు తీసుకోవాలని మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు కోరారు. ఈ మేరకు పట్టణ వీధుల్లో సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ ఎం.సూర్య తేజకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు మాట్లాడుతూ ఎంపి రఘురామకృష్ణంరాజు అభివృద్ధి పనుల నిమిత్తం పలు గ్రామాలకు నిధులు మంజూరు చేసినా, ఆ పనులు జరగకుండా అధికారులపై ఒత్తిడి తెస్తున్నారన్నారు.

పలు గ్రామాల్లో 'జగనన్న సురక్ష'

పెనుగొండ : మండలంలోని చిన్నమల్లం, దేవ గ్రామాల్లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పి.వెంకటేశ్వరరావు, సర్పంచి నల్లూరి సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రమణరాజు అంధ పాఠశాలలో 2022-23 విద్యా సంవత్సరం పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉత్తమ అవార్డులను అందించే కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. లయన్స్ క్లబ్ సీనియర్ నాయకులు గొట్టుముక్కల సత్యనారాయణరాజు (ఆకివీడు) మాట్లాడుతూ ఇటువంటి అభాగ్యుల జీవితాల్లో వెలుగు నింపుతున్న డాక్టర్ రమణరాజు ఒక వ్యక్తి కాదు ఒక సంస్థ అని, తమ సంస్థ ద్వారా ఈ విద్యాలయానికి సంపూర్ణ సహకారం అందిస్తామని చెప్పారు. భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వెంకటరమణ మాట్లాడుతూ చిత్తశుద్ధి అనే పదానికి రమణ రాజు సేవలే నిదర్శమన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా రమణరాజు అంధ పాఠశాలలను నిర్వహిస్తున్నారని, 25 మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని, ప్రతి ఏడాది ప్రతిభవంతులకు అవార్డులు అందిస్తున్నామని తెలిపారు. అనంతరం 17 మంది పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు అవార్డులను అందించారు. రమణరాజు మాట్లాడుతూ సంస్థ స్థాపించిన నాటి నుంచి అందరి సహకారంతో ముందుకు నడుస్తున్నామని, ప్రతి ఏడాది నూరుశాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్స్ ఛైర్మన్ నందమూరి రాజేష్, భట్టిప్రోలు శ్రీనివాసరావు, కె.శిరీష, సరోజినీ, సుబ్బరాజు, గంటా సుందర కుమార్ పాల్గొన్నారు.

ఫిట్స్‌పై హెల్త్ ఇండియా అధ్యయనం

ప్రజాశక్తి - భీమవరం

పరిశోధన సంస్థ సభ్యులు

ప్రముఖ ఆరోగ్య పరిశోధన సంస్థ జార్జ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్ ఇండియా ఆధ్వర్యంలో గత 15 ఏళ్లుగా భీమవరం కేంద్రంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు విస్తత సేవలు అందిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో నాన్ కమ్యూనికేబుల్ డిసిజెస్‌పై అధ్యయనం చేస్తున్నారు. దయానంద్ మెడికల్ కళాశాల, పంజాబ్, ఎయిమ్స్, ఢిల్లీ సంయుక్తంగా జిల్లాలో 14 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని 23 గ్రామాల్లో మూర్ఛ-ఫిట్స్‌కి సంబంధించిన అధ్యయనాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా జార్జ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో మంచిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆరవల్లి, దంతుపల్లి గ్రామాల్లో జార్జ్ ఇన్‌స్టిట్యూట్ సిబ్బంది మూర్ఛ-ఫిట్స్‌కి సంబంధించిన రోగులను గుర్తించారు. ఎయిమ్స్ ఢిల్లీలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహి స్తున్న ప్రముఖ డాక్టర్ మమతా భూషణ్ సింగ్‌తో కలిసి శిబిరం ఏర్పాటు చేసి పలు సలహాలు, సూచనలు అందిం చారు. ఈ కార్యక్రమంలో మంచిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు చాముండేశ్వరి, డాక్టర్ కిరణ్, జార్జ్ ఇన్‌స్టిట్యూట్ ప్రధాన పరిశోధకులు డాక్టర్ అమర్‌నాథ్, ఉషా ఖానాపూర్, సంస్థ సీనియర్ ప్రాజెక్ట్ సూపర్ వైజర్ బాలాజీరావు, వినయ్, సంస్థ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విఆర్‌ఒల సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా రవీంద్రరాజు

పెనుమంట్ర : గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా తాను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు భూపతిరవీంద్రరాజు తెలిపారు. ఈ మేరకు విజయవాడ ఫిలిం ఛాంబర్‌లో ఆదివారం ఎన్నికట్లు నిర్వహించినట్లు చెప్పారు. తాను రాష్ట్ర అధ్యక్షులుగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం ఆనందంగా ఉందన్నారు. అలాగే జిల్లా ప్రధాన కార్యదర్శి మిరియాల లక్ష్మీనారాయణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారని తెలిపారు. గణపవరం మండలంలో పనిచేస్తున్న అనూషకు రాష్ట్ర కార్యవర్గంలో ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆకాశం వచ్చిందన్నారు. రవీంద్రరాజుకు జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ప్రత్యేక అభినందనలు తెలిపారు.

వాలంటీర్లపై పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు దారుణం

ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వాలంటీర్లపై పవన్‌కల్యాణ్ నిరాధార ఆరోపణలు, అసంబద్ధ వ్యాఖ్యలు చేయడాన్ని వైసిపి ఖండిస్తుందని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వాలంటీర్లు కష్టపడి పనిచేసే వ్యక్తులని, అలాంటివారిపై పవన్ ల్యాణ్ లేనిపోని ఆరోపణలు చేయడం దారుణమన్నారు. వాలంటీర్ల నిస్వార్థ ప్రయత్నాలను గుర్తించి వారిని మెచ్చుకోవడానికి బదులు, ఇలాంటి నిరాధారమైన వ్యాఖ్యాలకు పూనుకోవడం చాలా హేయమన్నారు.

భీమవరంలో వాలంటీర్లు నిరసన ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్‌లో పవన్‌కల్యాణ్ దిష్టి బొమ్మను దహనం చేశారు. వాలంటీర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

మొగల్తూరు : పవన్‌కల్యాణ్ తమపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, క్షమాపణలు చెప్పాలని వాలింటీర్లు డిమాండ్ చేశారు. పవన్ వ్యాఖ్యలకు నిరసనగా మొగల్తూరు మూడో సచివాలయం వద్ద సోమవారం ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు నేరుగా తీసుకెళ్లడమే కాక అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు అందిస్తున్న తమపై అనుచిత వ్యాఖ్యలు చేయడం పవన్‌కు తగదన్నారు. ఈ కార్యక్రమంలో రాజేష్, కొడవలూరి దేవి, చెల్లుబోయిన ధనశ్రీ, నల్లం ఫణి నాగరాజు, దొంగ విజయలక్ష్మి, లక్కు భవాని, కొల్లాటి సంధ్య, బొడ్డు మంగ, దీపిక, పిప్పళ్ల సత్యసాయి పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి దాతల సహకారం అవసరం

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో ప్రజలు, దాతల సహకారం అవసరమని శృంగవృక్షం ఎంపిటిసి సభ్యురాలు సూర్యకళ అన్నారు. శృంగవృక్షం పంచాయతీ పరిధిలోని బంటుమిల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన డిఎస్‌పి బండి పెద్దిరాజు రూ.20 వేలు ఆర్థిక సహకారంతో సమకూర్చిన రాత పుస్తకాలు, విద్యా సామగ్రిని సోమవారం విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాలా లక్ష్మీరావు, కడలి సాయిబాబు, బండి వెంకటేశ్వరావు, బొక్కా ప్రసాద్, పాలా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వినియోగదారుల సమాఖ్య రాష్ట్ర సహ అధ్యక్షులుగా బంగారయ్య

ఆకివీడు : వినియోగదారుల సమాఖ్య రాష్ట్ర సహ అధ్యక్షులుగా ఆకివీడు సంఘ కార్యదర్శి, జిల్లా సమాఖ్య అధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సాయంత్రం విజయవాడ స్వాతంత్ర సమరయోధుల భవనంలో వినియోగదారుల సంఘాల రాష్ట్ర సమాఖ్య కార్యవర్గ సమావేశం నిర్వహించినట్లు బంగారయ్య సోమవారం స్థానిక విలేకర్లకు తెలిపారు. కార్యవర్గ అధ్యక్షుల ుగా ప్రతిపాదించినా వయసు రీత్యా తాను అంగీకరించకపోవడంతో సహ అధ్యక్షులుగా ఎన్నుకున్నారని తెలిపారు. సుమారు గత 35 సంవత్సరాలుగా బంగారయ్య ఆకివీడు కార్యదర్శిగా, 30 సంవత్సరాలుగా జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కార్యదర్శిగా ఉపాధ్యక్షులుగా భిన్నమైన పదవులు, బాధ్యతలు నిర్వహించి, సుమారు 125 పురస్కారాలు పొందిన ఘనత సాధించారు. ప్రస్తుతం 72 సంవత్సరాల బంగారయ్యకు రాష్ట్ర సహాధ్యక్ష స్థానం లభించడం పట్ల ఆకివీడు వినియోగదారుల సంఘం అధ్యక్షులు డాక్టర్ ఎంఎం.సులేమాన్, వృద్ధుల సంఘం గౌరవాధ్యక్షులు, వైద్య ప్రముఖులు జిల్లా లయన్స్ మాజీ గవర్నర్, వృద్ధుల సంక్షేమ సంఘ గౌరవ అధ్యక్షులు ఎంవి.సూర్యనారాయణరాజు, రెండు సంఘాల అధ్యక్ష కార్యదర్శులు, కార్యవర్గసభ్యులు, పలువురు స్థానిక ప్రముఖులు బంగారయ్యను వ్యక్తిగతంగా ప్రత్యేకంగా అభినందించారు.

భర్తీ కాని ఐకెపి ఎపిఎం పోస్టు

డ్వాక్రా మహిళల ఇబ్బందులు

పెనుమంట్ర : సంవత్సర కాలంగా ఐకెపి ఎపిఎం పోస్టు భర్తీ కాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని డ్వాక్రా సంఘాలు వాపోతున్నాయి. మండలంలో 1365 డ్వాక్రా సంఘాలు, 29 శ్రీనిధి, మూడు కమ్యూనిటీ క్లస్టర్లు, 32 మంది విఒలతో డ్వాక్రా కార్యకలాపాలు నడుస్తున్నాయి. గతేడాది ఎపిఎంగా పనిచేసిన పి.బాలకోటేశ్వరరావు పెంటపాడు బదిలీ కావడంతో ఇక్కడ స్థానంలో తణుకు ఎపిఎంగా పనిచేస్తున్న రామకృష్ణ ఇన్‌ఛార్జి బాధ్యతలు స్వీకరించారు. అయినప్పటికీ అందుబాటులో కార్యకలాపాలకు అంతరాయం కలుగుతుందని డ్వాక్రా మహిళలు వాపోతున్నారు. కొన్ని సందర్భాల్లో డ్వాక్రా మహిళా బ్యాంకుల్లో జమ చేసే నగదు చెల్లింపుల్లో కొన్ని చోట్ల జాప్యం జరుగుతుందని, దీంతో తమ గోడు చెప్పుకోవడానికి కూడా ఎవరూ లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎపిఎం పోస్టు భర్తీ చేయాలని కోరుతున్నారు.



మండల మహిళా సమాఖ భవనం

'స్పందన'కు 18 వినతులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 18 ఫిర్యాదులు అందినట్లు ఎస్‌పి రవిప్రకాష్ తెలిపారు. వీటిలో ఎక్కువగా వరకట్నం వేదింపులు, సరిహద్దుల విషయంలో గొడవలు, సివిల్ వివాదాలపై ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ఫిర్యాదులను ఎస్‌పి ఆయా పరిధిలో ఉన్న స్టేషన్లకు రిఫర్ చేసి బాధితులకు తగు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు.

ద్విచక్రవాహనదారుడికి హెల్మెట్ తప్పనిసరి

ద్విచక్రవాహనదారులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌పి రవిప్రకాష్ చెప్పారు. కొంతమంది సైబర్ నేరగాళ్లు బ్యాంక్ ఖాతాకు కెవైసి చేయాలని చెప్పి పంపి ంచే మెసేజులపై స్పందించవద్దన్నారు.

నేడు టిడిపి పాదయాత్ర

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం పట్టణంలో మంగళవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర రెండు వేల కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా సంఘీభావంగా ఈ పాదయాత్ర నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. టిడిపి కార్యకర్తలు, అభిమానులు, నాయకులు పెద్ద త్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

12న విజయవాడలో కాంగ్రెస్ మౌనదీక్ష

పాలకొల్లు : రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా గుజరాత్ హైకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ ఈ నెల 12వ తేదీన విజయవాడలో రాష్ట్ర కాంగ్రెస్ సారథ్యంలో మౌనదీక్ష చేస్తున్నట్లు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మార్నీడి బాబ్జి చెప్పారు. సోమవారం పాలకొల్లు కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల నుంచి ఈ దీక్షలో పాల్గొంటారని చెప్పారు. గాంధీ కుటుంబాన్ని దేశంనుంచి వెళ్ళగొట్టాలనే కుట్రలో భాగంగానే ఈ తీర్పు అన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్తలుగా నియమితులైన యడ్ల శివాజీ, వర్ధనపు కాసు పాల్గొన్నారు.

In The Court of Principal Junior Civil Judge, Tadepalligudem
O.S.No.76/2023

Between
UNION BANK OF INDIA, Tadepallidudm Plaintiff
1. M/s Balaji Dresses
Rep By Prop : Chappati Padmaja,
2. Chappati Padmaja Defendents

ప్రకటన

యిందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా పై నంబరు గ్రంధములో శ్రీ కోర్టు వారు జారీ చేసిన సమన్లు త్రిప్పి పంపుచున్నందున పై నంబరు గ్రంధములో substitute seivice ద్వారా మీకు పేపరు ప్రకటన మూలముగా తెలియజేయునది. ఏమనగా పై నంబరు గ్రంధము ది.13.07.2023 తేదిన వాయిదా అయివున్నది. మీరు గాని మీ తరుపున ప్లీడరు గారి ద్వారా గాని ది.13.07.2023 తేదిన ఉదయం 10.30 ని॥లకు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు కావలసియున్నది. లేని యెడల మీ పరోక్షముగ తీర్మానించడం జరుగును. యీ ప్రకటన మూలముగా తెలియజేయడమైనది.

ప్రతివాధుల అడ్రస్సు
1. M/s Balaji Dresses
Rep By Prop: Chappati Padmaja, W/o.Renukeswararao D.No.5-5-5,salipeta, rajuka Street, Tadepalligudem, W.G.dist
2. Chappati Padmaja
W/o.Renukeswararao,D.No.5-5-5,salipeta, rajuka Street, Tadepalligudem, W.G.dist

MAVLN Acharyulu, Advocate
Tadepallligudem, Cell:99632 30864

మహారాజశ్రీ 1వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో :: తణుకు
ఓ.యస్.నెం. 439/2020

బిట్వీన్:
విజయా బ్యాంక్, ప్రస్తుతం బ్యాంక్ ఆఫ్ బరోడ, Rep. by its Manager, తణుకు. ...వాది
మరియు
1) పజ్జూరి మోహనరాణి, భర్త: రమేష్, డో.నెం.19-5-11, బంగారు చెరువు గట్టు, పాలకొల్లు.
2) పజ్జూరి వీరమణి, భర్త: శ్రీనివాసరావు, డో.నెం.19-5-11, బంగారు చెరువు గట్టు, పాలకొల్లు.
...ప్రతివాదులు

ప్రకటన

పై నెంబరు గ్రంధములో ప్రతివాది అయిన మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినప్పటికినిన్నీ అమలు జరుగనందున శ్రీ కోర్టు వారు పేపరు పబ్లికేషన్ ఆర్డరు వేసియున్నారు. సదరు గ్రంధము **ది.20-07-2023వ తేదీకి వాయిదా అయి ఉన్నది.** కావున మీరిద్దరు సదరు తేదీన శ్రీ కోర్టు వారి ఎదుట ప్రత్యక్షముగా కాని లేక మీయొక్క ప్లీడరు గారి ద్వారా కాని హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపవల్సినదిగా ఈ పేపరు పబ్లికేషన్ ద్వారా తెలియచేయడమైనది. లేని ఎడల సదరు గ్రంధము మీ యొక్క పరోక్షములో తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

O.N.KRISHNA
Advocate, Tanuku.
Cell:98481 99440
తణుకు,
08-7-23.

మహారాజశ్రీ 1వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో :: తణుకు
ఓ.యస్.నెం. 610/2020

బిట్వీన్:
విజయా బ్యాంక్, ప్రస్తుతం బ్యాంక్ ఆఫ్ బరోడ, Rep. by its Manager, తణుకు. ...వాది
మరియు
1) వేముల హిమబిందు, తండ్రి: ప్రసాద్, డో.నెం.5-114, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.
2) వేముల సత్యవతి, భర్త: ప్రసాద్, డో.నెం.5-114, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.
...ప్రతివాదులు

ప్రకటన

పై నెంబరు గ్రంధములో ప్రతివాది అయిన మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినప్పటికినిన్నీ అమలు జరుగనందున శ్రీ కోర్టు వారు పేపరు పబ్లికేషన్ ఆర్డరు వేసియున్నారు. సదరు గ్రంధము **ది.24-07-2023వ తేదీకి వాయిదా అయి ఉన్నది.** కావున మీరిద్దరు సదరు తేదీన శ్రీ కోర్టు వారి ఎదుట ప్రత్యక్షముగా కాని లేక మీయొక్క ప్లీడరు గారి ద్వారా కాని హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపవల్సినదిగా ఈ పేపరు పబ్లికేషన్ ద్వారా తెలియచేయడమైనది. లేని ఎడల సదరు గ్రంధము మీ యొక్క పరోక్షములో తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

O.N.KRISHNA
Advocate, Tanuku.
Cell:98481 99440
తణుకు,
08-7-23.